సాక్షి ప్రకాశం



కందిపప్పును మేస్తున్న పందికొక్కులు

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న కేటుగాళ్లు కందిపప్పు, జొన్నలపైనా కన్నేశారు. వాటిని యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. - 8లో..

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు కోరారు. నియోజకవర్గంలో పార్టీ అనుబంధ కమిటీల నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 28/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జనన, మరణాలను యాప్‌లో నమోదు చేయాలి

- డీఆర్‌ఓ ఓబులేసు



శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వేపై నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వేలో గుర్తించిన ప్రతి జననం, మరణాలతో పాటు శిశు మరణాలను నెల వారీగా క్రమం తప్పకుండా మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఎన్యూమరేటర్లను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌ఓ ప్రారంభించి పలు సూచనలు చేశారు. జనాభా లెక్కల డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జనన మరణాలను నమోదు చేసే విధానాన్ని వివరించారు. దీనిలో స్టాటిస్టికల్ అధికారులు బిజు జార్జ్, మల్లికార్జునరావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ కార్యవర్గం ఎన్నిక



ఐఎంఏ నూతన కమిటీతో సీనియర్ వైద్యుల బృందం

ఒంగోలు టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. స్థానిక ఐఎంఏ హాలులో మంగళవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా డా.మన్నే వీరయ్య చౌదరి వ్యవహరించారు. అధ్యక్షునిగా డా.శివ సీతారామయ్య, కార్యదర్శిగా డా.జాలాది మణిబాబు, ఉపాధ్యక్షునిగా డా.జాకబ్ జకరయ్య, సంయుక్త కార్యదర్శిగా డా.సురేష్ బాబు, కోశాధికారిగా డా.రమణారెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా డా.తిరుమలరావు, డా.రంగనాథ్ బాబు, డా.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఐఎంఏ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు డా.ఝాన్సీ, డా.శ్రావణి అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలను సీనియర్ వైద్యులు డా.హరి విద్యాశంకర్, డా.కొమ్మి నరసింగరావు పర్యవేక్షించారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన రేపు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5, 6 వ తేదీల్లో జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులతో ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.వి.ఎల్.ఎన్. శివప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు 60 కొత్త ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరంలోని 9, 10 వ తరగతి విద్యార్థులు ఈ ప్రాజెక్టులను సందర్శించి, వివరాలు తెలుసుకోవచ్చన్నారు. నగరంలోని విద్యాసంస్థల విద్యార్థులు తప్పకుండా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో 26.2 మి.మీ వర్షపాతం

ఒంగోలు అర్బన్: జిల్లాలోని అన్నీ మండలాల్లో మంగళవారం వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సరాసరి 26.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కనిగిరి మండలంలో 72.6 మి.మీటర్లు నమోదు కాగా అత్యల్పంగా పుల్లలచెరువులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మద్దిపాడు మండలంలో 50.2, హనుమంతునిపాడు 50, కొత్తపట్నం 47.4, బేస్తవారిపేట 44.6, నాగులుప్పలపాడు 43.6, పెదచెర్లోపల్లి 38.2, కంభం 34.8, కొమరోలు 34, గిద్దలూరు 32.6, వెలిగండ్ల, ఒంగోలు 32.4, కొండపి 29.4, తర్లుపాడు 22.8, సంతనూతలపాడు 22.6, పొన్నలూరు 22.4, పొదిలి 16.4, రాచర్ల 16.2, పామూరు 15.4, తాళ్లూరు, సీఎస్‌పురం 15.2, మద్దిపూడి 12.2, మార్కాపురం 11.4, దర్శి 11.2, అర్ధవీడు 10.2, యర్రగొండపాలెం 8.6, చీమకుర్తి 8.4, దోర్నాల, కొనకనమిట్ల 8.2, జరుగుమల్లి 6.2, సింగరాయకొండ 5.8, త్రిపురాంతకం 5.6, టంగుటూరు 5.4, కురిచేడు 5, దొనకొండ 4.6, పెద్దారవీడు 3.8, ముండ్లమూరు మండలంలో 2.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

సిండికేట్‌లు

ఎలాంటి వంటకానికైనా ఉప్పులేనిదే రుచి ఉండదు. మరి దానిని పండించే రైతుల బతుకుల్లో రుచి ఉందా అంటే లేదనే చెప్పాలి. ఒక వైపు అనుకూలించని వాతావరణం.. మరో వైపు దళారుల దోపిడీతో వీరి పరిస్థితి దయనీయంగా మారింది. లాభాలు రావాల్సిన సమయంలో దళారుల మాయాజాలంతో ధరలు అమాంతం సగానికి పడిపోయాయి. బహిరంగ మార్కెట్లో 75 కేజీల బస్తా రూ.500 ఉండగా వీరి వద్ద నుంచి సిండికేట్లు కేవలం రూ.220 నుంచి రూ.250 మధ్య కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నారు.

- ఉప్పు రైతుపై దళారుల మాయాజాలం
- అమాంతం పడిపోయిన ధరలు
- వాతావరణం కారణంగా ఆగిన ఉప్పు తయారీ
- బహిరంగ మార్కెట్లో 75 కేజీల బస్తా రూ.500
- రైతు వద్ద 75 కేజీల బస్తా రూ.220 మాత్రమే
- పడిపోయిన ధరలతో నిరాశలో రైతన్నలు
- దళారులతో నష్టపోతున్నామని ఆవేదన



సింగరాయకొండ:

జిల్లాలో ఉప్పు రైతులకు కష్టకాలం వచ్చింది. సెప్టెంబరు నెల నుంచి వర్షాలు అడపా దడపా కురుస్తూ వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే సమయంలో ఉప్పు ధరలు పెరిగి రైతులకు లాభాలు రావాల్సి ఉంది. అయితే వ్యాపారులు, దళారులు సిండికేట్ అయి రైతును నిట్టనిలువునా దోచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో చినగంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉప్పుకొఠారుల్లో సుమారు 4 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. 7 వేలకు పైగా రైతులు, సుమారు 10 వేలకు పైగా కూలీలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. సింగరాయకొండ నుంచి తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి అవుతుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో అంటే సుమారు 9 నెలల పాటు ఉప్పు సాగు చేస్తారు. ప్రతి సంవత్సరం ఎకరాకు 75 కేజీల ఉప్పు బస్తాలు సుమారు 800 నుంచి 900 వరకు తయారవుతాయి. ఈ ప్రకారం ప్రతినెలా సుమారు 20 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి అవుతుంది. గత సంవత్సరం నవంబరు నెల వరకు ఉప్పు ఉత్పత్తి జరగగా ఈసారి మాత్రం సెప్టెంబర్ నెల నుంచే ఉత్పత్తి నిలిచిపోయింది.

తలకిందులు..

ఐదు సంవత్సరాలుగా వాతావరణం అనుకూలించడం, మార్కెట్లో ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండటం, పక్క రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి నేరుగా కొనుగోలు చేయడంతో రైతులు లాభాలు చవిచూశారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సెప్టెంబర్ నెల నుంచి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. రానున్న రోజుల్లో డిమాండ్ పెరిగి మంచి ధర వస్తుందని భావించిన రైతుల ఆశలపై దళారులు నీళ్లు జల్లారు. వ్యాపారులు, దళారులు సిండికేట్ కావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 75 కేజీల బస్తా ధర సుమారు రూ.500 ఉండగా, 25 కేజీల కేజీ ప్యాకెట్ల బస్తా ధర సుమారు రూ.250 ఉంది. సిండికేట్ మాయాజాలంతో 75 కేజీల బస్తా ధర కేవలం రూ.220 మాత్రమే ఉంది.



నిల్వ చేసిన ఉప్పు

దళారీ వ్యవస్థతో నష్టాలు

సింగరాయకొండ మండలంలో ఉప్పు వ్యాపారంలో దళారుల పాత్ర ప్రధానంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉప్పు ధరలు పెరగాలన్నా, తగ్గాలన్నా వీరి దయపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో ఊళ్లపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి ఉప్పు కొనుగోలు చేసేవాడు. అతని హయాంలో ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండేవి. అతను వ్యాపారులతో సిండికేట్ కాకుండా రైతులకు మంచి రేటు వచ్చేలా చేసేవాడు. తరువాత అతను ప్రమాదవశాత్తు మరణించాడని దీంతో ప్రస్తుతం ఉన్న వ్యాపారుల ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది. ఇతర ప్రాంతానికి చెందిన వ్యాపారులు వచ్చినా మేము చెప్పినట్టే వినాలని శాసిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కొత్త ఉప్పు కన్నా పాత ఉప్పు ధర సుమారు రూ.30 అధికంగా ఉండేది. అయితే ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. దళారుల పుణ్యమా అని కొత్త ఉప్పు ధర రూ.220 ఉంటే పాత ఉప్పు ధరను రూ.200లుగా నిర్ణయించారు. దీనిని బట్టి వీరి హవా ఏవిధంగా కొనసాగుతుందో అర్థమవుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ఉప్పు కొనుగోలు చేసి దళారుల చెర నుంచి రైతులకు విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దళారుల మాయతో ధరలు పడిపోయాయి



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ధరలు పెరుగుతుండటంతో ఉప్పు నిల్వ చేశాను. దళారుల కారణంగా ధరలు పడిపోయాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పురిణి దేవారెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

ప్రభుత్వమే ఉప్పు కొనుగోలు చేయాలి



5 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ప్రారంభంలో ధరలు ఆశాజనకంగా ఉన్నా ప్రస్తుతం వ్యాపారుల సిండికేట్ కారణంగా 75 కేజీల బస్తా కేవలం రూ.220 మాత్రమే ఉంది. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ఉప్పు కొనుగోలు చేస్తే రైతుకు మంచి ధరలు లభిస్తాయి.

– గౌరవరపు అంకమ రెడ్డి, ఉప్పురైతు, ఊళ్లపాలెం

దళారీ వ్యవస్థతో నష్టం



5 ఎకరాలు ఉప్పు కొఠార్లు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ఆరంభంలో ధరలు బాగా ఉన్నాయి. సెప్టెంబరు మొదటి వారంలోనే వర్షాల కారణంగా ఉప్పు ఉత్పత్తి నిలిచింది. దీంతో ధరలు బాగా ఉంటాయని ఉప్పు అమ్మకుండా నిల్వ చేశాను. సెప్టెంబరు లో 75 కేజీల బస్తా రూ.280 ఉంటే ఇంకా ధర పెరుగుతుందని ఆశించాను. కానీ ప్రస్తుతం ధర రూ.220 కు పడిపోవటంతో నష్టపోయే పరిస్థితి.

– పుచ్చలపల్లి వెంకారెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

- వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి, విద్యకు, ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 300 మంది దివ్యాంగులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందిస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు నిర్దేశించిన వికలాంగుల హక్కుల చట్టం జిల్లాలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాల కోసం ప్రత్యేక నియామక ప్రక్రియ చేపడతామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీవనోపాధుల కోసం అవసరమైన రుణాలు అందిస్తామని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న బంగారు బాల్యం కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థుల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే గానీ, మనస్సుకు, ప్రతిభకు కాదని, నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ అర్చన, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నారాయణ, మెప్మా పీడీ రవికుమార్, చీమకుర్తి ఎస్‌ఆర్‌కే చెవిటి మూగ పిల్ల పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందిస్తున్న కలెక్టర్

భూ కబ్జాలను అరికట్టాలి

- గ్రీవెన్స్ అర్జీలు సకాలంలో పరిష్కరించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రభుత్వ భూముల కబ్జాలు, ఆక్రమణలను ఉక్కుపాదం మోపి అరికట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. రెవెన్యూ, కోర్టు కేసులు, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం తదితర అంశాలపై మంగళవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు అసైన్డ్ భూముల కబ్జాలు, ఆక్రమణలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. భూముల స్వభావాన్ని బట్టి బాధ్యులకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వాలని సూచించారు. భూ కబ్జాలు, ఆక్రమణల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలన్నారు. ఈ నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇప్పటికే నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో సమావేశానికి గైర్హాజరైన వెలిగండ్ల, పుల్లలచెరువు మండల సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి వకాలత్, పునఃసమీక్ష తదితర పిటీషన్లను సకాలంలో దాఖలు చేయాలన్నారు. జిల్లాలో నుంచి వెళ్తున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జ జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న రేషన్ డీలర్లను త్వరగా భర్తీ చేస్తామని చెప్పారు. వీడియో సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోనలో జలసవ్వడి



సీఎస్‌పురం(పామూరు): ఫెంగల్ తుఫాన్ కారణంగా సీఎస్‌పురంతోపాటు మండలంలోని పర్యాటక పుణ్య క్షేత్రం భైరవకోన, వివిధ గ్రామాల్లో మంగళవారం భారీవర్షం కురిసింది. భైరవకోనలో జలపాతం నీరు తెల్లని పాలధారవలె నురగలతో సవ్వడి చేస్తూ ఉధృతంగా జాలువారుతోంది. భైరవకోనకు వెళ్లే మార్గంలో ఉన్న వంకలు, వాగులు జలకళను సంతరించుకోగా నీరు సప్టాలపై పారింది. త్రిముఖ దుర్గాదేవి ఆలయంలోకి ప్రవేశించిన జలపాతం నీరు అమ్మవారి పాదాలను తాకింది. వర్షాల కారణంగా జలపాతం ఉధృతిగా ఉండటంతో బుధవారం రాకపోకలు నిలిపేస్తున్నామని, భక్తులు, సందర్శకులు సహకరించాలని ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు నందనవనం విద్యార్థి



ఏసురత్నం



నందనవనం జిల్లా పరిషత్ బేస్ బాల్ క్రీడాకారులు

హనుమంతునిపాడు: జాతీయ స్థాయి అండర్ 14 బేస్ బాల్ పోటీలకు మండలంలోని నందనవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాయినూతల ఏసురత్నం ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సంభలో పీడీ రమేష్‌బాబు మాట్లాడుతూ నవంబర్ నెల 28వ తేదీ తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బేస్ బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ఏసురత్నం ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి బేస్ బాల్ క్రీడా పోటీల్లో ఆడతారన్నారు. ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్.రమణయ్య, హెచ్ఎం షేక్ మీరావలి, పీడీ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థిని అభినందించారు.

డీఈఎల్ఈడీ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

ఒంగోలు సిటీ: డీఈఎల్ఈడీ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ నవంబరు 2024 నకు సంబంధించిన పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పరీక్ష ఫలితాలను డమ్మీ మార్కుల జాబితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందాలని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేస్తే సబ్జెక్టునకు రూ.500 చలానా తీసి సెల్ఫ్ అడ్రస్ కవర్‌తో అడిషనల్ జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, గొల్లపూడి, విజయవాడ. చిరునామాకు పంపించాల్సిందిగా కోరారు.

చీమకుర్తి ప్రభుత్వాస్పత్రికి 'కాయకల్ప' అవార్డు

- అవార్డు కింద ఏటా రూ.1.50 లక్షల నగదు బహుమతి
- రాష్ట్రంలోని 175 సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో చీమకుర్తికి మూడో స్థానం



చీమకుర్తి ప్రభుత్వాస్పత్రి

చీమకుర్తి: చీమకుర్తిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ ఆస్పత్రి)కి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కాయకల్ప అవార్డు వచ్చింది. 2024 సంవత్సరానికి గాను కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో చీమకుర్తి ఆస్పత్రికి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం అవార్డు వచ్చిందని స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 175 సీహెచ్‌సీ ఆస్పత్రులు ఉండగా వాటిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆస్పత్రికి 97.86 పాయింట్ల స్కోరు రాగా మూడో స్థానంలో నిలిచిన చీమకుర్తి ఆస్పత్రికి 97.29 పాయింట్ల స్కోరుతో మూడో స్థానం సాధించినట్లు తెలిపారు. స్వల్ప స్కోరు తేడాతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కోల్పోయినా మూడో స్థానం సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆస్పత్రిలో అందించే వైద్య సేవలు, పరిసరాలు, సాంకేతిక పరికరాలతో అందించే సేవలు వంటి పలు విభాగాలను పరిగణనలోకి తీసుకొని పాయింట్ల స్కోరును ఇస్తారని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కాయకల్ప అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఆస్పత్రికి ప్రతి ఏటా ఇచ్చే రూ.1.50 లక్షల బహుమతిని ఆస్పత్రి అభివృద్ధికి కేటాయిస్తామని తెలిపారు. అవార్డు రావడానికి ఆస్పత్రికి చెందిన డాక్టర్లు, తోటి సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. వారందరికీ ఆస్పత్రి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

చీమకుర్తిలో బ్లడ్ స్టోరేజీ సెంటర్ ఏర్పాటు

చీమకుర్తి సీహెచ్‌సీ ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 7న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ చేతులు మీదుగా బ్లడ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో సెల్ టవర్స్‌కు అనుమతులు

ఒంగోలు అర్బన్: మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో సెల్ టవర్ల ఆవశ్యకతపై చర్చించి నాలుగు సెల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అనుమతి మంజూరు చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో డీఎల్‌సీ సమావేశం నిర్వహించారు. అటవీ ప్రాంతంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ యాక్టును అనుసరించి సెల్ టవర్ల ఏర్పాటుపై మార్కాపురం డివిజన్ డీఎఫ్‌ఓ సందీప్ కృపాకర్, శ్రీశైలం ఐటీడీఏ పీఓ వెంకటశివప్రసాద్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించి టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారు.

జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



జిల్లా మహిళా కబడ్డీ జట్టుతో అసోసియేషన్ సభ్యులు

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టును సింగరాయకొండ మండలంలోని పాకల జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఎంపిక చేశారు.వీరు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు సంతనూతలపాడులో నిర్వహించనున్న 71వ ఆంధ్ర సీనియర్ స్త్రీ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భాస్కరరావు, సెక్రటరీ పూర్ణచంద్రరావు, హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిల్లి హజరత్తయ్య, కార్యవర్గసభ్యులు కె.శ్రీలక్ష్మి తుది జట్టు ఎంపికను పర్యవేక్షించారు.

జట్టు వివరాలు

వి.అర్చన, కె.భూమిక, కె.నందిని, కె.సౌమ్య, వి.అపర్ణ, కె.విజయలక్ష్మి, కె.త్రిగుణ, కె.సిపోరా (పాకల), కె.నిరీష, వి.రోహిణి(కరేడు), ఎం.కీర్తి రెడ్డి(కనిగిరి), సీహెచ్ సింధు(కంబాలదిన్నె).

ముగ్గురు ఎస్‌ఐలకు స్థానచలనం

ఒంగోలు టౌన్: జిల్లాలో ముగ్గురు ఎస్‌ఐలకు స్థాన చలనం కలిగిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న బి.మహేంద్రను జరుగుమల్లి పోలీసు స్టేషన్‌కు, జరుగుమల్లిలో విధులు నిర్వహిస్తున్న యు.పున్నారావును ఒంగోలు టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఒంగోలు టూ టౌన్‌లో పనిచేస్తున్న ఎం.శివ నాంచారయ్యను వీఆర్‌కు పంపించారు.

పగటి పూటే విద్యుత్ సరఫరా చేయాలి


- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

కురిచేడు: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా పగటిపూట మాత్రమే చేయాలని మండలంలోని కాటంవారిపల్లె, పేరంబొట్లపాలెం గ్రామాల రైతులు మంగళవారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు, తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు సరఫరా చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. అంతేగాకుండా ప్రాణాపాయం కూడా పొంచి ఉందని, తమ ప్రాణాలకు ఎవరు హామీ ఇస్తారని ప్రశ్నించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ స్థాయి అధికారి కూడా లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పగటిపూట విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులతో మాట్లాడి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగి వెళ్లారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు 7కు వాయిదా

సంతనూతలపాడు: స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 5వ తేదీ నిర్వహించాల్సిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను 7వ తేదీకి వాయిదా వేసినట్లు సూదునగుంట ఫౌండేషన్ నిర్వాహకుడు సూదనగుంట కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రౌండ్ అనుకూలంగా లేకపోవడంతో పోటీలను వాయిదా వేశామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్నారై డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో 7 నుంచి 10వ తేదీ వరకు సాయంత్రం 5 నుంచి 9 గంటల మధ్య ఫ్లడ్ లైట్ల వెలుగులో స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

దడ పుట్టించిన భారీ కొండచిలువ!



కంభం: అర్ధరాత్రి వేళ ఓ కొండ చిలువ నివాసాల మధ్యకొచ్చి గ్రామస్తులందరికీ దడ పుట్టించింది. కంభం మండలం లింగాపురం గ్రామంలోకి సమీప పొలాల నుంచి సోమవారం రాత్రి సుమారు 12 అడుగుల కొండచిలువ ప్రవేశించింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని కొండచిలువను బంధించారు. జాగ్రత్తగా తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేయడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

కంది పప్పు మేస్తున్న పందికొక్కులు!



దర్శి లంకోజనపల్లి రోడ్డులో మంగళవారం రాత్రి 7.45 గంటల వేళ బారులుదీరిన కార్డుదారులు(ఇన్‌సెట్‌లో) రేషన్ దుకాణం



- రేషన్ డీలర్లకు కంది పప్పు కేటాయింపు 45 శాతమే..
- స్టాక్ రాలేదనే వంకతో కార్డుదారులకు కంది పప్పు ఎగ్గొట్టే ఎత్తుగడ
- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న పేదల బియ్యం
- కంది పప్పుతోపాటు జొన్నలనూ పక్కదారి పట్టిస్తున్న కేటుగాళ్లు
- ఎండీయూ వాహనాలు తిప్పకుండా దుకాణాల్లో సరుకులు తీసుకోవాలని హుకుం

జిల్లాలో రేషన్ షాపులు	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
1392	6,78,160	382

దర్శి:

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ నెలనెలా రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లు.. కంది పప్పు, జొన్నల పైనా కన్నేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓ పథకం ప్రకారం రేషన్ డీలర్లను వేధిస్తూ ఆయా స్థానాల్లో టీడీపీ కూటమి సానుభూతిపరులను నియమిస్తున్న విషయం తెలిసిందే. అదే అధికార మదంతో అడిగేవారు లేరన్న ధైర్యంతో రేషన్ సరుకులను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా పక్కదారి పట్టిస్తున్నా పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చోద్యం చూస్తున్నారు. సరుకుల తరలింపులో కూటమి సానుభూతిపరులైన డీలర్ల హస్తం ఉందని తెలిసినా చర్యలు తీసుకోలేకపోవడం అధికారుల నిస్సహాయతను తేటతెల్లం చేస్తోంది.

బియ్యం అందలేదు.. జొన్నలకు దిక్కులేదు

రేషన్ బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయకుండా కార్డుదారులనే దుకాణాల వద్దకు వచ్చి తీసుకోవాలని జిల్లాలో మూడొంతుల మంది డీలర్లు తేల్చిచెప్పారు. బియ్యం, ఇతర సరుకులు ఇస్తామని చెప్పి ఒకేసారి వేలి ముద్రలు తీసుకుంటున్న డీలర్లు.. బియ్యం బదులు డబ్బు అంటగట్టి, మిగిలిన సరుకులకూ ఎగనామం పెడుతున్నారు. ఈ పరిస్థితి దర్శి, కనిగిరి, మార్కాపురంతోపాటు ఒంగోలు నియోజకవర్గంలో అధికంగా ఉంది. బియ్యం ఇవ్వాలని కార్డుదారులు నిలదీస్తే సర్వర్ పనిచేయడం లేదనే సాకుతో మళ్లీ రావాలంటూ వెనక్కి పంపుతున్నారు. డీలర్ల వద్దకు తిరగలేక వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కార్డుదారులు మూడు కిలోల బియ్యం తగ్గించుకుంటే అంతే పరిమాణంలో జొన్నలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న కేటుగాళ్లు.. పనిలో పనిగా జొన్నలనూ బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

కంది పప్పు కేటాయింపులోనే కిరికిరి

రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సిన కందిపప్పులో 45 శాతం మాత్రమే అలాట్ చేస్తుండటం అక్రమార్కులకు వరంలా మారింది. కొద్ది మొత్తంలోనే స్టాక్ వచ్చిందనే పేరుతో సక్రమంగా పంపిణీ చేయకుండా కార్డుదారులను డీలర్లు సముదాయిస్తున్నారు. కంది పప్పు కోసం పేదలు కాళ్లరిగేలా తిరుగుతున్నా కరుణించడం లేదు. స్టాక్ వచ్చిన కొద్ది రోజుల్లోనే కంది పప్పు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. డీలర్‌కు కేజీ బియ్యం రూ.10 చొప్పున అక్కడే విక్రయిస్తేనే కంది పప్పు ఇస్తామని దర్శితోపాటు పలు నియోజకవర్గాల్లో కార్డుదారులకు అల్టిమేటం జారీ చేశారు.

కమీషన్ల కక్కుర్తిలో అధికార యంత్రాంగం

అవినీతికి పాల్పడుతున్న రేషన్ డీలర్ల వద్ద కొందరు అధికారులు నెల మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరుకులు సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై ఈగ వాలకుండా అటు నియోజకవర్గ ముఖ్య నేతలు కాపు కాస్తుండగా అధికారులు సైతం వారి సేవలోనే తరలిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. దర్శిలో ఎండీయూ వాహనాలు కదలకపోయినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు.

తప్పుకోకుంటే తప్పదు కేసులే..

ఫుడ్ కార్పొరేషన్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులను కొందరు రేషన్ డీలర్లపైకి ఉసిగొల్పి తనిఖీల పేరుతో కూటమి నేతలు సాగిస్తున్న అరాచకం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దర్శి, కొండపి నియోజకవర్గాల్లో రేషన్ డీలర్లపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ముండ్లమూరు మండలంలో ఓ రేషన్ దుకాణాన్ని గత ఐదు నెలల్లో 25 పర్యాయాలు తనిఖీ చేయడం వేధింపులకు నిదర్శనం. మద్రిపూడి మండలంలోనూ ఇదే పరిస్థితి. మార్కాపురం నియోజకవర్గంలో రాజీనామా చేయని డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేస్తామని ఏకంగా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులే బెదిరించడం గమనార్హం. మార్కాపురం పట్టణంలో 16 మంది డీలర్లను బెదిరించి కూటమి కార్యకర్తలకు దుకాణాలు అప్పగించారు. మరో 14 మందినీ అదే తరహాలో బెదిరించారు. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లోని పలువురు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు ఒక బృందంగా ఏర్పడి డీలర్లకు వాట్సాప్ కాల్స్ చేసి బెదిరించిన తీరు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గిద్దలూరుతో పాటు మిగిలిన నియోజకర్గాల్లో కూటమి నేతల ఆగడాలు, అధికారుల వేధింపులు భరించలేక కొందరు డీలర్లు స్వచ్ఛందంగా తప్పుకొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాధికకు పదోన్నతి

ఒంగోలు: ఒంగోలు జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నెట్టెం రాధిక సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన న్యాయమూర్తి రాధికను విజయవాడలోని 2వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జువైనల్ కోర్టు)గా బదిలీ చేశారు. ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బాధ్యతలను 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జికి అప్పగించాలని హైకోర్టు రిజిస్ట్రార్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆదర్శనీయుడు బాబూ రాజేంద్ర ప్రసాద్




బాబా రాజేంద్ర ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: దేశ స్వాతంత్య్ర పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొని, దేశానికి స్వాతంత్య్రం వచ్చాక తొలి రాష్ట్రపతిగా ఎన్నికైన బాబూ రాజేంద్ర ప్రసాద్ ఆదర్శనీయుడని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాబూ రాజేంద్ర ప్రసాద్ 140వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రను కాసు ఆదిలక్ష్మి వివరించారు. రాజకీయ నాయకుడిగా, న్యాయవాదిగా, పాత్రికేయుడిగా, పండితుడిగా బహుముఖ పాత్రలను సమర్థవంతంగా పోషించిన రాజేంద్ర ప్రసాద్ తొలి రాష్ట్రపతిగా దేశాభివృద్ధికి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. రెండు సార్లు రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆయన నిరాడంబరంగా జీవితాన్ని గడిపారని తెలిపారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, టి.కృష్ణవేణి, పి.ఇమ్మానియేలు, ఎస్.అనిల్ కుమార్, వై.మృదుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు



మాట్లాడుతున్న ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఒంగోలు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గస్థాయిలో అనుబంధ స్థాయి కమిటీల్లో నియమించేందుకు సమర్థ నాయకుల కోసం కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. యువత, రైతులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విద్యార్థి విభాగం, పంచాయతీరాజ్ విభాగం, మున్సిపల్ విభాగం, వాణిజ్య విభాగం ఇలా అన్ని అనుబంధ కమిటీలను త్వరలో నియమించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో మంచి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నూతనోత్సాహం పెంపొందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అన్నీ అనుబంధ విభాగాల నాయకులతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపినట్లు ఆయన చెప్పారు. గ్రామ స్థాయి నుంచే నాయకులు పార్టీ పటిష్టతకు, బలోపేతానికి కృషి చేసేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. క్యాడర్ బేస్డ్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణం చేపడుతున్నారన్నారు. ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని విమర్శించారు. అధికార దాహంతో ఆచరణకు నోచుకోని హామీలు గుప్పించడం, ప్రజలను బురిడీ కొట్టించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు కేవలం పింఛన్ల పంపిణీతో సరిపెట్టుకుంటున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ రూ.10 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పాడటం శోచనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నిందలు మోపుతూ కాలయాపన చేయడం కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ఇచ్చిన హామీలకు కట్టుబడి పాలన సాగించాలని హితవు పలికారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.11.87 లక్షలు



హుండీలోని నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో హుండీల ఆదాయం గత 2 నెలల 24 రోజులకు సంబంధించి మొత్తం రూ.11,87,972 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.ఏ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధాన హుండీల ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈనెల 3వ తేదీ వరకు వరకు మొత్తం 2 నెలల 24 రోజుల హుండీ కానుకలు లెక్కించినట్లు తెలిపారు. ప్రధాన హుండీల ద్వారా రూ.10,06,781, అన్నదాన హుండీల ద్వారా రూ.1,81,191 మొత్తం రూ.11,87,972 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ, నెల్లూరుకు చెందిన బ్యాంకు రిటైర్డ్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్వాక్రా అవకతవకలపై నిగ్గు తేల్చరే?

- అక్రమార్కులకు టీడీపీ నేతల వత్తాసు
- నాడు గగ్గోలు, నేడు నోరుమెదపని పచ్చనేతలు
- ఒమ్మెవరం వీవోఏ ఘరానా మోసంపై కానరాని స్పందన

నాగులుప్పలపాడు: మండలంలోని ఒమ్మెవరంలో వీఏవో పరిధిలో ఘరానా మోసంపై అటు పోలీసు శాఖ, ఇటు అధికారుల్లో స్పందన కరువైంది. నాడు ఎన్నికలకు ముందు ఈ అంశంపై కలెక్టరేట్ సాక్షిగా హంగామా చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అధికారంలో ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులకు టీడీపీ నేతల మద్దతు ఉండటంతో నేడు వారు నోరు మెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఒమ్మెవరంలో డ్వాక్రా సంఘాల పొదపు ఖాతాల నుంచి స్త్రీనిధి రుణాల నుంచి ఇంచుమించు రూ.35 లక్షల మేరకు నిధులు స్వాహా చేశారు. నాటి వీవోఏ కోటా అనిత, ఆమె కుమారులు కోటా వంశీ, కోటా నితిన్‌లు ఈ అక్రమాలకు పాల్పడ్డారు. ఈ లావాదేవీలన్నీ గ్రామ సమాఖ్య ఖాతాల నుంచే జరిగాయి. ఈ క్రమంలోనే గత ఎన్నికలకు ముందు వ్యవహారం వెలుగు చూడటంతో నిందితులు అనిత, వంశీ, నితిన్‌లు గ్రామం నుంచి పరారయ్యారు. దీని ద్వారా ఎన్నికల లబ్ధి పొందేందుకు నాడు టీడీపీ నేతలు రోడ్డెక్కి గగ్గోలు పెట్టారు. నాటి మంత్రి మేరుగు నాగార్జున ఈ విషయంలో చొరవ చూపి పరిష్కారం చూపుతామని ఆసక్తి చూపినా రాజకీయ దురుద్దేశాలను ఆపాదించారు. ఆ అంశాన్ని నాటి టీడీపీ నేతలు మరుగున పెట్టారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉంది. ఈ క్రమంలో ఈ కేసుపై దృష్టిసారించి అక్రమాల నిగ్గు తేల్చాలి. బాధితుల్లో ఎక్కువ మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఉండటం, అక్రమార్కులతో టీడీపీ నేతలకు సన్నిహిత సంబంధాలు ఉండటంతో దీన్ని మరుగున పెట్టే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కనీసం నోటీసులు ఇవ్వని పోలీసులు

ఈ కేసులో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినా ఇప్పటి వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు. వారు పరారీలోనే ఉన్నట్లు చూపుతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన నిందితురాలు అనిత మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించారు. పోలీసులే దగ్గరుండి అంత్యక్రియలు చేయించారు. అయితే వారు నేటికీ పరారీలో ఉన్నారని, తమ కంట పడలేదని చెబుతుండటం గమనార్హం. పోలీసు శాఖ కూడా దొంగలకు మద్దతుగా నిలుస్తోందన్న ఆరోపణలున్నాయి.

స్త్రీనిధి రుణాలు లేనట్టే

ప్రతి మండలంలో స్త్రీనిధి రుణాలు కొత్తగా మంజూరు కావాలంటే తీసుకున్న రుణాల్లో రూ.20 లక్షలకు మించి బకాయిలు ఉండ కూడదు. ఒమ్మెవరంలో రుణాలు అంతకు మించి ఉండటంతో ప్రస్తుతం నాగులుప్పలపాడు మండలంలో స్త్రీనిధి రుణాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది. మండల వ్యాప్తంగా స్త్రీనిధి రుణాల ఆగిపోవడం, నిధుల గోల్‌మాల్ పై డీఆర్‌డీఏ పీడీ వసుంధరను వివరణ కోరగా గ్రామ సమైఖ్య సంఘంలో నిధుల గోల్‌మాల్‌పై ఇప్పటికే విచారణ చేస్తున్నామని, ఈ చర్యలకు కారకులైన వారిపై పోలీసు కేసు పెట్టామని తెలిపారు. త్వరలో ఈ అంశంపై విచారణ పూర్తి చేసి నిధుల గోల్‌మాల్‌పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పాముకాటుతో బాలుడు మృతి

- నిద్రిస్తుండగా అర్ధరాత్రి వేళ ఘటన



కుమారుడి మృతదేహంపై పడి విలపిస్తున్న తల్లి లక్ష్మి

గిద్దలూరు రూరల్: తల్లి, ఇద్దరు అక్కలతో అప్పటివరకు ముచ్చట్లు చెప్పుకుని నిద్రకు ఉపక్రమించిన బాలుడిని విష సర్పం బలితీసుకుంది. ఈ విషాద సంఘటన గిద్దలూరు మండలంలోని బురుజుపల్లె గ్రామంలో సోమవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న మనోజ్(8) తల్లి లక్ష్మి, తన తోబుట్టువులతో కలిసి తమ రేకుల షెడ్‌లో నిద్ర పోతున్నాడు. సమీపంలోని పొలాల నుంచి వచ్చిన ఓ పాము రేకుల షెడ్ పైభాగంలో పాకుతూ మంచంపై నిద్రిస్తున్న మనోజ్ తలపై పడి కాటు వేసింది. ఈ హఠాత్పరిణామానికి భీతిల్లిన బాలుడు కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లి పామును చేతపట్టి దూరంగా విసిరికొట్టింది. బంధువులు, స్థానికులు స్పందించి బాలుడిని హుటాహుటిన గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బాలుడు మృతి చెందాడు. కళ్ల ముందే కొడుకు మృతి చెందడంతో ఆ తల్లి గుండెలవిసేలా విలపించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా బాలుడి తండ్రి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా, తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

కామెంట్ చేశాడని కత్తితో పొడిచాడు!

మార్కాపురం: బైక్‌పై వెళ్తుండగా వెకిలిగా కామెంట్ చేశాడనే ఆగ్రహంతో ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన సంఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు.. మార్కాపురానికి చెందిన ఆకుల ఏడుకొండలు సోమవారం రాత్రి తన బుల్లెట్ బైక్‌పై తూర్పు వీధి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జువ్వి చెట్టు సమీపంలో ఉన్న యశ్వంత్ రెడ్డి వెకిలిగా కామెంట్ చేశాడని భావించాడు. ఇంటికి వెళ్లి కత్తి తీసుకుని వచ్చి యశ్వంత్ రెడ్డిపై ఏడుకొండలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

గంజాయి స్వాధీనం

టంగుటూరు: మండల కేంద్రం టంగుటూరులో 166 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు టంగుటూరు నుంచి సింగరాయకొండ వైపు వెళ్లే సర్వీస్ రోడ్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 166 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోనికి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభం

టంగుటూరు: వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం టంగుటూరు నుంచి కొనిజేడుకు ప్రయాణికులతో వెళ్తున్న వాహనం జమ్ములపాలెం గ్రామ సమీపంలో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం విరిగి ఓ వైపు ఒరిగిపోయింది. ప్రమాదంలో వాహనం ముందు భాగం కొంతమేర దెబ్బతినగా ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వాహనాన్ని మరొక వాహనం సాయంతో పక్కకు తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి స్తంభానికి మరమ్మతులు చేశారు.